# అద్దం

"శేరూ -

అది పిలుపు కాదు కేక, అందులోనూ పొలికేక -

తను పెట్టిన కేకకి తన కంఠనరాలు చిట్లిపోతాయనుకుంది సరస్వతి. తను పొందిన ఆవేదనకీ ఆవేశానికి గుండెలు దడదడ కొట్టుకుని ఆగిపోతాయనుకుంది సరస్వతి.

కానీ ఏమీ కాలేదు. అంతటి కేక ఆమె లోపలి కంటా ప్రతిధ్వనించి ఆమెకెలాగో వినిపించింది. ఆ గొంతు తనది కాదు ఎప్పటిదో, ఎవరిదో విచిత్రంగా వికారంగా తోచిందొక క్షణం. అంతలోనే ఆ గొంతును గుర్తించేందుకు మనసు పరుగులు ప్రారంభించింది.

సరస్వతి కూతురు శారద మేడమెట్లు దిగి చకచకా వెళ్ళిపోతున్న జోళ్ళ శబ్దం క్రమంగా దూరమైంది. సరస్వతి మెదడంతా చికాకుగా అయిపోయింది. ఆమె గొంతు లోంచి చీల్చుకొచ్చిన మరో గొంతు ఆమెను వెంటాడుతూనే ఉంది. సరస్వతి నెమ్మదిగా అడుగులు వేస్తూ తన పడక గదిలోని మంచం మీదకెళ్ళి ఒరిగింది. ఒత్తిగిల్లింది. బీరువాకు బిగించిన అద్దంలో ఎవరో ముఖం అతికించుకున్న తన శరీరాన్ని చూసి ఉలిక్కి పడింది, లేచింది.

అద్దం ముందుకెళ్ళింది. నెమ్మదిగా అతి నెమ్మదిగా తనది కాదనుకున్న ముఖం ఎవరిదో గుర్తించ మొదలు పెట్టింది. గుర్తించిన కొద్దీ·దుఃఖం గుండెల్ని పిండేస్తోంది. అవునవును ఆ కంఠమెవరిదోనో కూడా గుర్తుకొస్తోంది. అది అర్థమవుతున్న కొద్దీ కంఠం కన్నీళ్ళతో గరగరమని పోతోంది. కళ్ళు రెండూ నీళ్ళతో నిండి నిర్లిప్తంగా చెంపల మీదకి జార్చేస్తున్నాయి.

అవునా ముఖం అమ్మదే - అవునా కంఠం అమ్మదే, తనకి పద్దేనిమిదేళ్ళ వయస్సులో అమ్మ ముఖం ఇలాగే ఉండేది. అవును అమ్మకప్పుడు ఇప్పటి నా వయస్సే - నిజమే మరి ఇప్పుడు శారూకి పద్దెనిమిది నిండాయి.

ఏ తల్లి అనుభవమూ ఏ కూతురికీ అవసరం లేదు. ఏ తల్లి ఆవేదనా ఏ కూతురికీ పట్టదు. ఏ తండ్రి ఆశయమూ ఏతనయుడికీ అక్కరలేదు.

అమ్మభావాలు బాధలూ పాతచింకాయ పచ్చడి
నాన్న ఆదర్శాలు, ఆక్రోశాలు రోత పుట్టె ఛాందసాలు .

అలాగే అద్దంలో ప్రతిబింబం చూస్తూ నిలబడిపోయింది. సరస్వతి ఆ ముఖం పూర్తిగా అమ్మలా మారింది. విచారంగా ఓదారుస్తున్నట్లుగా ఉంది. ఎప్పుడో పదేళ్ళ క్రితం చనిపోయిన అమ్మ అద్దంలో తన ముఖంలో ముఖమై పలకరిస్తుంటే ఆనందం లేదు సరికదా పట్టలేని ఏడుపు కట్టలు తెంచుకుంటోంది.

మళ్లీ మంచం మీద ఒరిగింది. చెంప మీంచి వేడిగా కన్నీళ్లు జారుతున్నాయి. ఆమె పెదవులు 'కనిపించునాగతము - వినిపించునా' అంటూ అదిరిపోతూ కదిలాయి. ఏ నాటి పాట అది తన చిన్ననాటి పాట రేడియోలో బాల మురళీకృష్ణ రచించి, బాణీ కూర్చి శ్రీరంగం గోపాల రత్నంచేత పాడించిన పాట. తనెంత బాగా పాడేది ! ఎన్నిచోట్ల పాడింది ? ఎక్కడ పడితే అక్కడ, ఏ నలుగురూ కలిసినా సరస్వతీ ఓ పాట పాడు అనే వారు. తను పాడేది -

కానీ తనూ అమ్మ హృదయం ఏనాడూ గ్రహించలేదు. ఆమె కోరికను ఎప్పుడూ మన్నించలేదు.

సరస్వతి తల్లీ, సుందరమ్మ మంగళంపల్లి వారి ఆడపడుచు అధ్యాత్మ రామాయణ కీర్తనల నుండి ఘనరాగ పంచకం వరకు అద్భుతంగా పాడేదామె. నాలుగు గోడల మధ్య వంటావార్పూ, చంటీ వెంటాతో, ఎప్పుడూ బాలింతగానో సూలింతగానో ఓపికున్నన్నాళ్లూ గడిచి పోయింది. ఆమె సంగీతం పెళ్ళిళ్లకు పేరంటాలకు పరిమితమై నిలిచిపోయింది.

సుందరమ్మలో ఉన్న సంగీత జ్ఞానము, మంచి శ్రావ్యమైన కంఠం వచ్చిందామె నాలుగో కూతురైన సరస్వతికి. అందుకే ఆ తల్లి ఎప్పుడూ సరస్వతి మీద ఎన్నో ఆశలు పెంచుకునేది. ఎన్నో కలలు కనేది. ఆమె తన కుమార్తె గొప్ప గాయకురాలు కావాలని ఎంతో అనుకునేది. శిక్షణ యిస్తే ఎంతటి గాయకురాలైనా కాగల శక్తి సామర్ధ్యాలు సరస్వతికి ఉన్నాయి. కానీ సరస్వతిలో ఉండాల్సినంత శ్రద్ధా, ఆసక్తి సంగీతం పట్ల లేవు, ఏదో సమయం వచ్చినప్పుడు చాలా చక్కగా ప్రతిభావంతంగా పాడేసేది. అందరూ

చప్పట్లు కొడితే ఆ క్షణం ఉప్పొంగిపోయేది. వెంటనే వదిలేసేది. అంతేగానీ, సంగీతంలో కృషి చెయ్యాలనీ, దీక్షగా సాధన చెయ్యాలని అనుకునేది కాదు.

సుందరమ్మ ఎప్పుడూసరస్వతి వెంటపడేది ఏకాన్త సమయం దొరికినా ''కాస్సేపు కూర్చుని పాడుకోరాదుటే'' అనేది.

''అబ్బ ఉండవే - ఇప్పుడు కాదు'' అని విదిలించి మరేదో పనిలోకి పోయేది సరస్వతి.

పన్నెండేళ్ళు వచ్చేవరకు సుందరమ్మ కూతుర్ని భయపెట్టి బెదిరించి సంగీతం మాషార్ని యింటికి పిలిపించి సంగీతం నేర్పించింది. చెప్పింది యిట్టే పట్టేసేది, పాడేసేది. మాష్టారు కూడా ఆ పిల్లకి మంచి సంగీత జ్ఞానం, గళం ఉన్నాయి. గానీ శ్రద్ధ తక్కువ అంటూ వాపోయేవారు.

నెమ్మదిగా ఆ మాష్టారికీ, ఆయన సంగీత పాఠానికీ అందకుండా పోయింది సరస్వతి. తండ్రికి సంగీతమంటే ఇష్టమున్నా, స్కూలు మొత్తంలో చదువులో ఫస్టుగా వెలిగిపోతున్న కూతుర్ని సంగీతం వైపు మళ్ళించే ప్రయత్నం చేయలేదు.

సెవెన్త్ ఫారం రిజల్ట్స్ వచ్చాయి. సరస్వతి స్కూలు ఫస్టు రావడమే కాదు, సైన్సులో 97% మార్కులు తెచ్చుకుంది. ఆమెకి ఎమ్.బి.బి.ఎస్ సీటు హారతి పళ్ళెంతో పెట్టి వచ్చింది. అప్పటో ఈ ఎమ్ సెట్‌లూ అవీ లేవు.

ఆ రోజు సుందరమ్మ కూతుర్ని బుజ్జగించింది.

''ఏమే సరూ, నీకెంతో మంచి కంఠముంది, జ్ఞానముంది, అదంతా వదిలేస్తావా, ఈ డాక్టరు గిరీ ఎందుకే - హాయిగా సంగీత సాధన చెయ్యి, ఎమ్ ఎస్ సుబ్బలక్ష్మంత దానవవుతావు'' అంది.

సరస్వతి నవ్వి - ''వద్దమ్మా ఏమిటో అలా కచేరీలు చేస్తూ పాటలు పాడుకోవడం నాకిష్టం లేదు. నేను మంచి డాక్టరుగా సంఘసేవ చేయాలని ఉంది'' అంది.

''కొన్నివేల మంది డాక్టర్లలో నువ్వూ ఒకతెవు. కానీ ఈ దేశంలో సుబ్బలక్ష్మి ఒకతే'' అంది.

మరీ చాదస్తంగా మాట్లాడకు. నాకు సంగీతమంటే ఇష్టమే. కానీ ఇవన్నీ వదులుకోలేను'' అంటూ అక్కడ్నించి లేచింది ఎవరో పిలుస్తుంటే -

''ఉండు, ఒక్క క్షణం - నేను చెప్పేది పూర్తిగా చెప్పనీ...''

''ఇంకా ఏముంది - నేను మెడిసిన్‌లో చేరడమే నాకిష్టం. నేను డాక్టర్ని కావాలి'' అంటూనే చకచకా వెళ్ళిపోతున్న సరస్వతిని

'సరూ'' అంటూ గట్టిగా అరిచింది సుందరమ్మ. సరస్వతి వినిపించుకోలేదు - దూరంగా మేడమెట్లు దిగి వెళ్ళిపోతున్న సరస్వతి అడుగుల శబ్దం క్రమంగా సుందరమ్మకు వినిపించటం ఆగిపోయింది.

ఆ తర్వాత సరస్వతి మెడిసన్‌లో చేరింది. మంచి స్టూడెంట్‌గా రాణించింది. కాలేజీ ఫంక్షన్లలోనూ, ఇంటర్ కాలేజీ పోటీలలోనూ పాటల్లో ఎన్నో బహుమతులు గెల్చుకుంది.

''అబ్బ ! సరస్వతి ఎంత బాగా పాడిందండీ - అచ్చం సుశీలలా పాడింది. అచ్చం ఆశాభాంస్లే లా పాడింది'' అంటూ అందరూ పొగుడుతూ ఉంటే ఆ కాస్సేపు మురిసేది. ''మీరు సంగీతంలో ఎందుకు కృషి చెయ్యలేదు'' అని ఎవరైనా అడిగితే, గర్వంగా, కాస్త అతిశయంగా ఒక నవ్వు నవ్వి ఊరుకునేది.

సరస్వతి తన క్లాస్‌మేట్ ప్రసాద్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది - ''అన్నిటికంటే నీలో నాకు ఎంతో నచ్చింది నీ పాట'' అని ప్రసాద్ అన్నప్పుడు ఆనందపడింది. తన నంతగా ప్రేమించే వ్యక్తిని సంపాదించుకునేందుకు తన పాట ఉపయోగపడినందుకు గర్వపడింది -

డాక్టరుగా జీవితం ఎంతో డబ్బు గడించేందుకు, ఎంతో పరపతి సంపాదించేందుకు ఉపయోగపడింది. అపురూపంగా పుట్టిన ఏకైక కూతురికి శారదని పేరు పెట్టింది. ఆ పిల్ల మూడేళ్ళ వయసుకే నారాయణతే నమో నమో అంటూ అన్నమయ్య కీర్తన పాడితే ఆనందపడి పోతూనే, సాధన లేనందువల్ల, వయసు మీద పడుతూండటం వల్ల తను మునుపటిలా పాడలేకపోతున్నందుకు బాధ పడసాగింది. ఎందుకో తను సంగీతాన్ని నిర్లక్ష్యం చేశాననే దిగులు దినదిన ప్రవర్ధమానం కాసాగింది అయితే అప్పుడప్పుడు తను పార్టీలలో, పెళ్ళిళ్ళలో ఏదైనా చిన్న పాట పాడినా అందరూ

తన చుట్టూ మూగి ఆరాధనగా చూస్తూంటే తనేదో పోగొట్టుకున్న భావం ఆమెను బాధించేది.

అప్పుడే సరస్వతి తన కూతురు శారదకి బాగా సంగీతం చెప్పించాలని, మంచి గాయనిని చెయ్యాలని, అనుకుంది. అలా అనుకున్నప్పుడు తన తల్లి సుందరమ్మ కూడా ఇలాగే అనుకుంది అని ఎప్పుడూ గుర్తు రాలేదు.

సరిగ్గా 13 ఏళ్ళు వచ్చేసరికి శారద బాగా సంగీతం నేర్చుకుంది. సరస్వతి ఒక్కొక్కసారి కూతురి పాట విని తనకంటే ఎంతో ఒదుగు శారద కంఠంలో ఉందని గ్రహించేది. అది తన తల్లి సుందరమ్మ పోలికని గర్వంగా చెప్పేది –

14 ఏళ్ళ వయస్సు రాగానే శారదలోనూ అభిరుచులు మారాయి.

సంగీతాన్ని తన ఊపిరిగా, తన తపస్సుగా భావించే స్థితి ఆమెలో లేకపోయింది, చదువు, కాంపిటేషన్లు మార్కులు, స్కూలు ఫస్టులు, స్టేట్ ఫస్టులు – ఇవన్నీ శారదని బాగా ఆకట్టుకున్నాయి. ఆమెకీ అప్పుడప్పుడు పాడుకునే హాబీగానే సంగీతం మిగిలి పోయింది–,

శారద తల్లిలాగ డాక్టరు కావాలనుకోలేదు, తల్లి కోరుకున్నట్లు సంగీత కళాకారిణీ కావాలనుకోలేదు. మరేదో కావాలనుకుంది. ఎలక్ట్రానిక్స్‌లో చేరింది.

ఆమె ప్రయత్నాలు చూస్తూ ఊరుకున్న సరస్వతి ఆపైన ఆగలేకపోయింది.

''చూడవే శారూ, నువ్వెంతో బాగా పాడగలవు, నీకు మంచి కంఠముంది, ఒకటి రెండు సంవత్సరాలు నువ్వు దీక్షగా కృషి చేస్తే, చక్కని ఆర్టిస్టువి కాగలవు. నా మాట విను'' అంటూ బతిమాలింది.

''నాకేమిటో అలా చెయ్యాలని లేదు.మమ్మీ, సంగీతం పాడతాను, ఎప్పుడైనా బోర్‌గా ఉన్నప్పుడు, అంతే'' అంది శారద.

సరస్వతి నిట్టూర్చింది ''మా అమ్మ నన్నెంతో బతిమాలింది, నేను విన్నాను కాదు, వింటే ఎంతో చేయగలిగి ఉండేదాన్ని''

''మరి అమ్మమ్మ మాట వినకపోయా'' అంటూ జోళ్ళు వేసుకుని చకచకా వెళ్ళి పోతుంటే సరస్వతికి ఎక్కడ లేని కోపమూ వచ్చింది ''శారూ'' అంటూ పాలికేక

పెట్టింది. కానీ ఆ కేక కూతుర్నేం ఆపలేదు. ఆమె ''నేను త్వరగా వెళ్ళాలి'' అంటూ దూరం నుంచి కేకవేసి వెళ్ళిపోయింది.

సరస్వతి అద్దంలో చూస్తుండి పోయింది. అమ్మ ముఖం నెమ్మదిగా కరిగి కరిగి, అమ్మ పోలికలతో ఉన్న తన ముఖమే స్పష్టమైంది.

అవును, ఎవరి అనుభవం వారిది, ఎవరి అభిరుచి వారిది ఎవరి ఆదర్శం వారిది. ఎవరి బాధ వారిదే, మరి ఎవరి జీవితం వారిదే కదా ! అంది ప్రతిబింబం.

'మనసు స్వాధీనమైన' అనే ఎప్పుడూ అమ్మ పాడే త్యాగరాజ కీర్తన, సరస్వతి మనసుకు స్వాధీన మిస్తూండగా నెమ్మదిగా అద్దం ముందు నుంచి కదిలింది.

రచన 'దీపావళి' 98